నేడు కూకట్‌పల్లికి రానున్న ఎంపీ

బాలానగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆదివారం పర్యటించనున్నారు. బీజేపీ బస్తీబాటలో భాగంగా ఉదయం 8.30 గంటలకు బాలానగర్ ఇందిరానగర్, శ్రీశ్రీ నగర్, రాజీవ్‌గాంధీనగర్‌లో పర్యటించిన అనంతరం కేపీహెచ్‌బీ మలేషియన్ టౌన్‌షిప్ అపార్టుమెంట్ వాసులతో ముఖాముఖీ, కూకట్‌పల్లి నల్లచెరువు సందర్శన, జేఎన్‌టీయూలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు ఓల్డుబోయినపల్లి అంజయ్యనగర్, హస్మత్‌పేట, వడ్డెరబస్తీ ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో ఈటల పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం



అంజనేయస్వామి విగ్రహ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేకు విరాళాన్ని అందజేస్తున్న మర్యాద అశోక్

కూకట్‌పల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి సీతారామచంద్రస్వామి దేవాలయంలో అంజనేయస్వామి రాతి విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూకట్‌పల్లి వాస్తవ్యులు మర్యాద అశోక్ రమాదేవి దంపతులు విగ్రహ ఏర్పాటు కోసం లక్ష రూపాయల విరాళాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఓల్డ్ బోయినపల్లి డివిజన్‌కు చెందిన ఎండీ ఇర్ఫాన్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.75వేల చెక్కును ఎమ్మెల్యే కృష్ణారావు అందజేశారు.

నేడు ఎమ్మెల్యే పర్యటనలు

ఆదివారం రోజు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంషీగూడ కోదండరామస్వామి దేవాస్థానం, శిల్ప బృందావనం, మూసాపేటలో యాదవబస్తీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి బోనాలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. అలాగే రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే బోనాలు, బేగంపేటలో మెడికల్ క్యాంపు, సీనియర్ సిటిజన్ మయూర్ మార్గ్‌లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఇచ్చిన ప్రకటనలో పేర్కొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ

కూకట్‌పల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా స్థాయిలో ఈ నెల 24న టీబీ(క్షయ) నిర్మూలనపై జరిగే అవగాహన ర్యాలీలో పాల్గొనాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు టీబీ నియంత్రణ శాఖ అధికారులు ఆహ్వానం అందించారు. 24న కూకట్‌పల్లిలోని రామ్‌దేవ్‌రావు ఆస్పత్రి నుంచి ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూసాపేట యూపీహెచ్‌సీ డాక్టర్ మౌనిక, టీబీ సూపర్‌వైజర్ మోహన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రెండో రోజు పరీక్ష రాసి ఇంటికి వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

పరీక్షల సందడి

రెండవ రోజు పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. దీంతో బాలానగర్ శోభనా, ఐడీపీఎల్, ఓల్డుబోయినపల్లి హస్మత్‌పేట బస్టాపులు రద్దీగా మారాయి. - బాలానగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి)

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

- పైలెట్ ప్రాజెక్టు కింద 17 ఎస్ఆర్‌వోలు ఎంపిక

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు(ఎస్ఆర్‌వో)ల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ భావిస్తోంది. ఉగాదిలోగా పైలెట్ ప్రాజెక్టు కింద 17 ఆఫీసుల్లో ఈ విధానాన్ని ప్రారంభించాలని సన్నాహాలు చేస్తోంది. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 148 ఎస్ఆర్‌వోల్లో ఈ విధానాన్ని తీసుకురానున్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న ఆరు ఎస్ఆర్‌వోలను అధికారులు ఎంపిక చేశారు. ఇందులో హైదరాబాద్ జిల్లాలోని చిక్కడపల్లి, ఆజంపురా, రంగారెడ్డి జిల్లాలోని ప్రాంతీయ కార్యాలయం(ఆర్ఓ), శంషాబాద్.. మేడ్చల్ జిల్లాలోని కుత్బుల్లాపూర్, మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో ఉగాది నుంచి రోజుకు 48 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగేలా వినియోగదారులకు 48 టైమ్ స్లాట్లను అందుబాటులోకి తేనున్నారు. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చలానాలను ఆన్‌లైన్‌లోనే చెల్లించి ఆ డాక్యుమెంట్లు ప్రింట్ తీసుకుని ఎస్ఆర్‌వోకు వెళితే 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అయితే సంతకాలకు బదులు ఎలక్ట్రానిక్ సిగ్నేచర్ పద్ధతిని అవలంబించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.



పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు రివార్డులు అందిస్తున్న సీపీ అవినాష్ మహంతి

నేరస్థులకు కఠిన శిక్షలు పడేలా పనిచేయాలి

సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారులు పోక్సో, హత్య, అత్యాచారం, చైన్ స్నాచింగ్, దోపిడీ, మోసం వంటి కేసుల్లో త్వరిత గతిన విచారణ చేపట్టడంతోపాటు తరచూ సమీక్షలు నిర్వహించాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సూచించారు. గచ్చిబౌలి కమిషనరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో నేరస్థులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకున్న అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లను అభినందించి రివార్డులు అందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, కమిషనరేట్ పరిధిలో శిక్షల శాతం పెరిగేలా డీసీపీలు ప్రతి నెలా పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయ సమావేశాలు నిర్వహించుకోవాలని కోరారు. క్రూరమైన నేరాలకు పాల్పడిన నిందితులకు గరిష్ఠ శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనరేట్ పరిధిలో నమోదైన 44 కేసులకు సంబంధించి నిందితులకు ఏడేళ్లకన్నా ఎక్కువ శిక్షలు పడేలా చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జాయింట్ సీపీ గజారావ్ భూపాల్ మాట్లాడుతూ, నిందితులకు కఠిన శిక్షలు పడటం కోసం న్యాయ నిపుణులతో సమన్వయం చేసుకొని పనిచేయాలని సూచించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మంజులా దేవి పలు సూచనలు సలహాలు అందించారు.

జలమండలి అధికారులకు సన్మానం

హైదర్‌నగర్,మార్చి22(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జల దినోత్సవం పురస్కరించుకుని జలమండలి కార్యాలయంలో జీఎం ప్రభాకర్, డీజీఎం నాగప్రియ, మేనేజర్ ఝాన్సీ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌ను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, తాగునీటిని వృధా చేయకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణగౌడ్, జిల్లా గణేష్, షౌకత్ అలీమున్నా, యాదగిరి, జలమండలి సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్షం.. అతలాకుతలం



వినాయకనగర్ రోడ్డుపై వర్షం నీరు

- రోడ్లపైకి చేరిన మురుగు నీరు
- ట్రాఫిక్‌జాంతో ప్రయాణికుల ఇక్కట్లు

బాలానగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి బాలానగర్ ప్రాంతంలోని రోడ్లు జలమయమయ్యాయి. రోడ్డుపై నడుచుకుంటూ, వాహనాలపై వెళుతున్న వారంతా బ్రిడ్జి, రేకుల షెడ్లు, చెట్ల కిందికి పరుగులు తీశారు. వర్షానికి తోడు విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో వాహనదారులు, ఇండ్లలో ఉన్న ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నాలాలోని మురుగు నీరు పంచవటి అపార్ట్‌మెంట్, వినాయకనగర్ రోడ్లపైకి వచ్చి చేరింది. శనివారం ఉదయం వరకు నీరు నిలిచిపోయి ఉండడంతో సమాచారం అందుకున్న కార్పొరేటర్ రవీందర్ రెడ్డి జీహెచ్ఎంసీ సిబ్బందిని పిలిపించి మ్యాన్ హోల్‌ను తెరిపించి నీటిని దారిమళ్లించారు. అయితే 10వ తరగతి పరీక్షలు మొదలైన నేపథ్యంలో కరెంట్ అంతరాయం కలగడం, కరెంటు వస్తూ పోతూ ఉండడంతో తమ పిల్లలు చదువుకోలేక పోయారని, అధికారులు స్పందించి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యార్థుల తల్లితండ్రులు అధికారులకు, కార్పొరేటర్‌ను కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు

కేపీహెచ్‌బీకాలనీ/హైదర్‌నగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కాసేపటి వర్షానికే బస్తీలు, కాలనీల్లోని అంతర్గత రోడ్లలో నీరు నిలిచింది. కేపీహెచ్‌బీ మూడోఫేజ్, మూసాపేట్ ఆంజనేయగనర్ చౌరస్తా, శంషీగూడ నుంచి భాగ్యనగర్ కాలనీ వచ్చే ప్రధాన రహదారి ఉషాముళ్లపూడి హాస్పిటల్ రోడ్డులో వాన నీరు చేరింది. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించిన వాహన దారులకు ఇబ్బందులు తప్పలేదు.



వర్షపు నీటిని మ్యాన్‌హోల్‌కు మళ్లిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది



శంషీగూడ నుంచి భాగ్యనగర్ కాలనీకి వెళ్లే రోడ్డు వద్ద ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



సహాయనిధి మంజూరి పత్రాలు అందజేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, సీనియర్ నాయకుడు వెంకటేశ్వరరావు

హైదర్‌నగర్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్న రామారావు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది అనంతరం ఆస్పత్రి బిల్లుల కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో అతనికి మంజూరైన రూ.1.50 లక్షలకు సంబంధించిన అనుమతి పత్రాలు కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జీ బండి రమేష్, సీనియర్ నాయకుడు జి.వెంకటేశ్వరరావు శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. అర్హులందరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.

పుల్లూరు నారాయణదాస్ ఆరాధన మహోత్సవం

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జ్యోతిర్లింగ భువనేశ్వరి దేవస్థానం ప్రతిష్ఠాపకులు పుల్లూరు నారాయణదాస్ 25వ ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. బాలాజీనగర్ వివేక్‌నగర్‌లోని ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై అన్న సమారాధన ప్రారంభించారు. అంతకు ముందు పాలాభిషేకం, పుష్ప బిల్వార్చన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కృష్ణ రాజ్‌పుత్, గాదె శివ చౌదరి, బండి సుధా, స్వరూపా గౌడ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్త



సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లకు సూచనలు చేస్తున్న సీఐ నర్సింహరాజు

బాలానగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న వారు ఏ మాత్రం నిర్లక్ష్యం వహించరాదని బాలానగర్ సీఐ టి.నర్సింహరాజు అన్నారు. సైబర్ నేరాలు, వాటి బారిన పడకుండా ఉండాలంటే తీసుకోవలసిన జాగ్రత్తలపై సెక్యూరిటీ గార్డులు, సెక్యూరిటీ సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. శనివారం బాలానగర్ ఎస్ఎంఆర్ వినయ్ క్యాపిటల్ భవనంలో యాక్షన్ గ్రూప్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సైబర్ నేరాల అవగాహన కార్యక్రమంలో పాల్గొని పలు విషయాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, తాము పనిచేస్తున్న సంస్థలో ఏదైనా ప్రమాదం, దొంగతనం జరిగితే మొదట సంస్థ యాజమాన్యానికి ఆ తర్వాత స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఫైర్ సేఫ్టీ యంత్రాలను ఎలా వాడాలో ముందే తెలుసుకోవాలన్నారు. సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న సంస్థ తమ ఈఎస్ఐ, పీఎఫ్ జమ చేస్తుందా లేదా చెక్ చేసుకోవాలని సూచించారు. బోరుకొడుతుందని ఫేక్ వీడియో కాల్స్, డ్రగ్స్ మనీ, బెట్టింగ్ యాప్స్ వైపు ఆకర్షితులైతే తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తుందన్న విషయం గుర్తు పెట్టుకోవాలని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో సెక్యూరిటీ సంస్థ డైరెక్టర్ అబ్దుల్ యూసుఫ్, ఎస్సై మహ్మద్ హాజీమియా, సెక్యూరిటీ సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి



శోభనా బస్టాపు వైపుకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న ప్రయాణికులు



శాశ్వత ఐరన్ డివైడర్‌ను ఏర్పాటు చేసిన అధికారులు

బాలానగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ ప్రజలకు శోభనా బస్టాపు వెళ్లాలంటే పెద్ద సమస్యగా మారింది. బాలానగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చాక రోడ్డు ప్రమాదాలు జరుగకుండా అధికారులు ఐరన్ డివైడర్లను ఏర్పాటు చేయడంతో శోభనా బస్టాపుకు వెళ్ళాలంటే హరిజన బస్తీ సిగ్నల్ వరకు నడుచుకుంటూ వెళ్ళి రోడ్డు దాటి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా వెళ్లి రోడ్డుదాటి యూటర్న్ తీసుకుని రావడంతో సమయం వృథా అవుతోంది. రద్దీగా ఉంటే ఈ ప్రాంతంలో పలువురు పాదాచారులు రోడ్డు దాటబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. శోభనా బస్టాపు మీదుగా బాలానగర్‌లోని 10 బస్తీలకు చెందినవారు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు శోభనా బస్టాపు వద్దకే రావాల్సి ఉంటుంది. ఇలా అవస్థలను అధిగమించాలంటే ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఒక్కటే పరిష్కారమని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, పలువురు స్థానిక నాయకులు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. నెలలు గడిచినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో భయం భయంగా రోడ్డు దాటాల్సి వస్తోంది. కొందరు మొండిగా ఐరన్ డివైడర్ ఎక్కి దిగుతూ బస్టాపుకు చేరుకుంటున్నారు. ప్రస్తుతానికి పాదాచారులు రోడ్డు దాటేందుకు సిగ్నల్స్, జీబ్రా లైన్లు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నప్పటికి ఆ దిశగా అధికారులెవ్వరూ పట్టించుకోకపోవడంతో ప్రజలు అసహనానికి గురౌతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు అధికారులకు ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

చర్య తీసుకోవాలి



శోభనా బస్టాపు వద్దకు ప్రజలు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డు దాటాల్సిన పరిస్థితి ఉంది. ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తే రోడ్డు ప్రమాదాలు జరుగకుండా బ్రిడ్జి ఎక్కి అవతలి వైపుకు వెళ్ళే అవకాశం కలుగుతుంది. ఈవిధంగా అధికారులు చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

- లక్ష్మణ్, టైలర్ స్థానికుడు, బాలానగర్

వీడిన బాలిక అదృశ్యం మిస్టరీ

- కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడిపై పోక్సో కేసు
- అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యం కేసు మిస్టరీని పోలీసులు 9 గంటల్లోపు ఛేదించారు. లైంగిక దాడికి యత్నించిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి ప్రాంతంలో నివాసముంటున్న దంపతుల కుమార్తె మెదక్‌లో అమ్మమ్మ వద్ద ఉంటోంది. ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసింది. కాగా తల్లిదండ్రుల వద్దకు బయలుదేరింది. జూబ్లీ బస్టాండ్‌కు చేరుకున్న బాలికను మెదక్‌లో పరిచయమైన యువకుడు మాయమాటలు చెప్పి తన వెంట తీసుకెళ్లాడు. ఎంతకీ యువతి ఇంటికి చేరకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు తమకు లభించిన సీసీ ఫుటేజీని తల్లిదండ్రులకు చూపించారు. వారిచ్చిన సమాచారంతో మెదక్ సమీపంలో ఉన్న గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించారు. స్నాప్‌చాట్‌లో అతడి ప్రొఫైల్ వివరాలు సేకరించారు. ఆ గ్రామ సర్పంచ్‌ను సంప్రదించి యువకుడి బాబాయ్ సెల్ నంబర్ తీసుకున్నారు.

కాల్ చేసి యువకుడు వద్ద ఉన్న మొబైల్ నంబర్ అనంతరం దమ్మాయిగూడలో బాలిక ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. వెంటనే అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా తనపై అత్యాచార యత్నానికి ప్రయత్నించాడని బాలిక వారికి తెలిపింది. దీంతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఆపై అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే కేసును 9 గంటల వ్యవధిలోనే ఛేదించిన మారేడ్‌పల్లి పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

ట్రావెల్ టికెట్ల పేరుతో మోసం

పంజాగుట్ట, మార్చి22(ఆంధ్రజ్యోతి): ట్రావెల్ టికెట్ల పేరుతో ఓ నృత్యకళాకారిణిని మోసగించారు. ఈ సంఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. గతేడాది ఏప్రిల్‌లో తన బృందంతో కలిసి బాలీ వెళ్లేందుకు ఢిల్లీకి చెందిన ట్రావెల్ ఏజెంట్ మోహిత్‌ను బేగంపేట.. కుందన్‌బాగ్‌కు చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి సంప్రదించింది. విమానం టిక్కెట్ల కోసం రూ.7.71 లక్షలు అతనికి ఇచ్చింది. రోజులు గడుస్తున్నా టిక్కెట్లు ఇవ్వక పోగా చుట్టూ తిప్పించుకుంటున్నాడు. దీంతో అనుమానం వచ్చి గట్టిగా నిలదీస్తే అతని నుంచి ఎలాంటి సమాధానం లేదు. దీంతో మోసపోయానని గ్రహించిన ఆమె శనివారం పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వర్షపు నీటిని ఒడిసిపడదాం

గాజులరామారం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతినీటి బొట్టును ఒడిసిపట్టు.. రేపటి తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎస్వీఆర్ ట్రస్ట్ ఫౌండర్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని చిత్తారమ్మదేవి నగర్‌లో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా పది ఇంకుడు గుంతలను ట్రస్ట్ సభ్యులతో కలిసి శనివారం తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి పొదుపు చేయకపోతే రాబోయే తరాలు ఇబ్బందులకు గురవుతారని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వర్షపు నీటిని ఒడిసిపట్టి పొదుపు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సబీహ బేగం

పార్కులను సందర్శించిన కార్పొరేటర్

అల్లాపూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ కార్పొరేటర్ సబీహా బేగం డివిజన్‌లోని ఉమెన్ అండ్ చిల్డ్రన్ పార్కు, సున్నం చెరువు పరిసరాల్లోని 'రాక్ గార్డెన్' పార్కులను శనివారం పరిశీలించారు. మొదటగా 'ఉమెన్ అండ్ చిల్డ్రన్' పార్కులో పర్యటించిన కార్పొరేటర్ అక్కడ టెన్నిస్ కోర్టు నెట్, బెంచీలు, పబ్లిక్ టాయిలెట్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలంటూ స్థానికులు కోరగా అందుకు ప్రణాళిక సిద్ధం చేయాలంటూ అధికారులను కోరారు. అటు సున్నం చెరువులో ఉన్న 'రాక్ గార్డెన్' పార్కులోనూ గ్రీనరీ పెంచాలని, భూగర్భ డ్రైనేజీ ఏర్పాట్లు, విరిగిపోయిన ఓపెన్ జిమ్ పరికరాలను రిపేరు చేయించాలంటూ స్థానికులు కోరారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ పనులు జరిగేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గాయత్రీనగర్ సంక్షేమ సంఘం సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వండి



జడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ రెవెన్యూ విలేజ్ సర్వే నంబర్లు 145, 163లో భవన నిర్మాణాలకు జీహెచ్ఎంసీ అనుమతులు ఇవ్వాలని జడ్సీ అపూర్వ్ చౌహాన్‌ను శనివారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు కలిసి వినతిపత్రం అందజేశారు. గత 35 ఏళ్లుగా అనుమతులతోనే వేలాది భవనాలు నిర్మించుకున్నారని తాజాగా అనుమతులు నిరాకరించడం వల్ల వసంతనగర్, సర్దార్‌పటేల్‌నగర్, భగత్‌సింగ్‌నగర్ ఫేజ్-1, ఫేజ్-2, సీబీసీఐడీ, ఎన్ఆర్ఎస్ఏ, డైమండ్ ఎస్టేట్స్ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో వేలాది భవనాలు నిర్మాణం జరిగాయని, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అనుమతుల నిలిపివేతను ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వసంతనగర్ సొసైటీ అధ్యక్షులు యర్రా నాగేశ్వరరావు, ఎన్ఆర్ఎస్ఏ కాలనీ అధ్యక్షులు హనుమంతరావు, నాని ఉన్నారు.



డిజిటల్ సేఫ్టీపై అవగాహన కల్పిస్తున్న హెల్పేజ్ ఇండియా ప్రతినిధులు, కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు

డిజిటల్ సేఫ్టీపై సీనియర్ సిటిజన్లకు అవగాహన

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డు కాలనీ 13వ ఫేజ్‌లోని మహేంద్ర ఆశ్విత గృహ సముదాయంలో డిజిటల్ సేఫ్టీపై సీనియర్ సిటిజన్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్పేజ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమన్వయకర్త శ్యామ్ సీనియర్ సిటిజన్ల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం జరిగిన చర్చా కార్యక్రమంలో 2040 నాటికి దేశంలో పెరగనున్న సీనియర్ సిటిజన్ల సంఖ్య, దీనివలన భవిష్యత్తులో సమాజంపై పడే ప్రభావాన్ని ప్రొఫెసర్ కావ్య వివరించారు. ఆయా కార్యక్రమాల్లో సీనియర్ సిటిజన్లు హరిప్రసాద్, అప్పారావు, శ్రీకృష్ణ, పీఎస్ఎన్ మూర్తి, సుబ్రమణ్యం, అర్జునరావు, పి.కె.రాయ్, మల్లేశ్వరరావు, ఆదిలక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.11, వంకాయ రూ.18, బెండకాయ రూ.40, పచ్చి మిర్చి రూ.40, బజ్జి మిర్చి రూ.33, కాకరకాయ రూ.40, బీరకాయ రూ.38, క్యాబేజీ రూ.10, బీన్స్ రూ.45, క్యారెట్ రూ.16, గోబి పువ్వు రూ.18, దొండకాయ రూ.40, చిక్కుడు కాయ రూ.50, గోరు చిక్కుడు రూ.40, బీట్‌రూట్ రూ.16, క్యాంప్సికం రూ.37, అలుగడ్డ రూ.25, కీర రూ.18, దోసకాయ రూ.18, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.15, కంద రూ.60, ఉల్లిపొరక రూ.23, ఉల్లిగడ్డ రూ.24, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.43, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.30, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ.50-60, మునగ కాయలు రూ.5-6, పచ్చిబఠాణి రూ.45, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.160, అల్లం రూ.80, వెల్లుల్లి రూ.140, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.100, కరివేపాకు రూ.100, పర్వల్ రూ.60, పల్లికాయ రూ.60, లోబా రూ.25, ఆ కాకరకాయ రూ.60. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.



పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు రివార్డులు అందిస్తున్న సీపీ అవినాష్ మహంతి

నేరస్థులకు కఠిన శిక్షలు పడేలా పనిచేయాలి

సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారులు పోక్సో, హత్య, అత్యాచారం, చైన్ స్నాచింగ్, దోపిడీ, మోసం వంటి కేసుల్లో త్వరిత గతిన విచారణ చేపట్టడంతోపాటు తరచూ సమీక్షలు నిర్వహించాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సూచించారు. గచ్చిబౌలి కమిషనరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో నేరస్థులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకున్న అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లను అభినందించి రివార్డులు అందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, కమిషనరేట్ పరిధిలో శిక్షల శాతం పెరిగేలా డీసీపీలు ప్రతి నెలా పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయ సమావేశాలు నిర్వహించుకోవాలని కోరారు. క్రూరమైన నేరాలకు పాల్పడిన నిందితులకు గరిష్ఠ శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనరేట్ పరిధిలో నమోదైన 44 కేసులకు సంబంధించి నిందితులకు ఏడేళ్లకన్నా ఎక్కువ శిక్షలు పడేలా చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జాయింట్ సీపీ గజారావ్ భూపాల్ మాట్లాడుతూ, నిందితులకు కఠిన శిక్షలు పడటం కోసం న్యాయ నిపుణులతో సమన్వయం చేసుకొని పనిచేయాలని సూచించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మంజులా దేవి పలు సూచనలు సలహాలు అందించారు.



జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

కాలనీలల్లో పారిశుధ్య నిర్వహణ పట్టించుకోరా?

ఖేల్‌కాలనీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాలనీలల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, వీధుల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. డివిజన్ కార్యాలయంలో పారిశుధ్య సమస్యలపై సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. పారిశుధ్య పనులలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని, నిత్యం ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలన్నారు. పార్కుల్లో చెత్తతొలగింపు కోసం ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, వాటి అభివృద్ధి కోసం మంజూరైన పనులు సకాలంలో పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ విజయరామారావు, యూబీడీ మేనేజర్ మానస, సూపర్‌వైజర్లు అనీల్, శ్రీనివాస్, రాజు, జిలానీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి మంజూరి పత్రాలు అందజేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, సీనియర్ నాయకుడు వెంకటేశ్వరరావు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

హైదర్‌నగర్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్న రామారావు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది అనంతరం ఆస్పత్రి బిల్లుల కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో అతనికి మంజూరైన రూ.1.50 లక్షలకు సంబంధించిన అనుమతి పత్రాలు కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జీ బండి రమేష్, సీనియర్ నాయకుడు జి.వెంకటేశ్వరరావు శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. అర్హులందరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.



మసీద్‌బండలోని బీజేపీ కార్యాలయంలో శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, తదితరులు

పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం

- ఎంపీ కొండా కొండా విశ్వేశ్వరరెడ్డి

గచ్చిబౌలి,మార్చి22(ఆంధ్రజ్యోతి): బీజేపీలో కష్టపడి పనిచేసిన ప్రతీ కార్యకర్తకు శ్రమకు తగ్గ ఫలితం ఉంటుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఇటీవల రంగారెడ్డి జిల్లాఅర్బన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. శనివారం శేరిలింగంపల్లి మసీద్‌బండలోని బీజేపీ కార్యాలయంలో శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి కార్యకర్తలతో చిత్తశుద్ధి, కఠోరదీక్ష అలవర్చుకున్న కార్యకర్త భవిష్యత్‌లో రాణిస్తారని, అలాంటి వారికి ఉన్నత పదవులు దక్కుతాయన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి పార్టీ అధిష్ఠానానికి, సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు. అనంతరం మసీద్‌బండలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.



నాలా విస్తరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

నాలా విస్తరణ పనుల పరిశీలన

గచ్చిబౌలి,మార్చి22(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్‌లో జరుగుతున్న నల్లగండ్ల పెద్దచెరువు నుండి బీహెచ్‌ఈఎల్ చౌరస్తా వరకు నాలా విస్తరణ పనులను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ శనివారం పరిశీలించారు. పనులు పూర్తయితే ఓపెన్‌డ్రైవ్, సైడ్‌వాల్స్ పనులు గడువులోగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. నాలాల విస్తరణ పనులతో లోతట్టు ప్రాంతాల సమస్యలు పరిష్కారమౌతాయని, ముఖ్యంగా ముంపు ప్రాంతాలకు శాశ్వత ఉపశమనం కలుగుతుందన్నారు. పనుల్లో జాప్యం లేకుండా స్థానికులకు ఇబ్బందులు లేకుండా పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణంతోనే
ట్రాఫిక్‌కు చెక్

- వివిధ మార్గాలద్వారా వాహనాల మళ్లింపునకు సమాలోచనలు
- ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారుల నిర్ధారణ
- కాలనీలకు వెళ్లే వారి ప్రయాణం సులభతరం చేయడానికి చర్యలు

చందానగర్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్‌లో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య జఠిలమౌతోంది. జాతీయ రహదారితోపాటు కాలనీలకు వెళ్లే రోడ్డులో కూడా తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొనిఉంది. కొన్ని చోట్ల గంటల తరబడి రోడ్లపైనే ఉండాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీనిని అధిగమించేందుకు ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా పలుమార్లు చర్చలు జరిపారు. కొన్ని రహదారుల్లో ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించడంతో సమస్యకు చెక్‌పెట్టవచ్చని నిర్ధారణకు వచ్చారు. ట్రాఫిక్‌ను మళ్లించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించారు. జాతీయ రహదారి నుంచి చందానగర్ డివిజన్‌లోని కాలనీలకు వెళ్లే వారికి ట్రాఫిక్ సులభతరం చేయడానికి చర్యలు తీసుకున్నారు. అందుకోసం ప్రణాళికలను తయారు చేసి ఉన్నతాధికారుల ఆమోదం లభించి నిధులు కూడా మంజూరయ్యాయి.దీంతో సమస్యకు కొంత వరకు చెక్‌పెట్టేందుకు అవకాశం ఉంది.

ప్రత్యామ్నాయ మార్గాలు ఇవే

గంగారం-అపర్ణహిల్‌పార్కు రోడ్డు.. జాతీయ రహదారి గంగారం హనుమాన్ దేవాలయం నుంచి పెద్దచెరువు అలుగునుంచి కట్టకింది నుంచి అపర్ణహిల్స్ సురక్షాకాలనీ నుంచి అమీన్‌పూర్ రోడ్లకు కనెక్టివిటీ అయ్యే విధంగా చర్యలు చేపట్టారు. సుమారు కి.మీ పైచిలుకు పొడవు, 80 అడుగుల వెడల్పు సెంట్రల్ లైటింగ్, గార్డెనింగ్, ఫుట్‌పాత్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఇందు కోసం రూ.14 కోట్లు మంజూరయ్యాయి. అమీన్‌పూర్ వైపు వెళ్లే వారికి సులభతరమే కాకుండా దూరభారం కూడా తగ్గుతుంది.

చందానగర్- అమీన్‌పూర్ రోడ్డు..

చందానగర్ నుంచి అమీన్‌పూర్ వరకు శ్రీదేవి థియేటర్ రోడ్డు 100 అడుగుల రోడ్డు నిర్మాణ పనులు కొంతవరకు జరిగి నిలిచిపోయాయి. నిర్మాణ పనులకు అడ్డంకులు తొలగిపోయాయి. మిగిలిన పనుల నిర్మాణం కోసం రూ.24 కోట్లతో 2.2 కి.మీ పొడవు దాకా నిర్మించనున్నారు. సెంట్రల్ లైటింగ్, రోడ్డుకు ఆరువైపులా గార్డెనింగ్, సర్వీస్‌రోడ్డు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం పూర్తయితే అమీన్‌పూర్‌కు వెళ్లేవారికి ట్రాఫిక్ సులభతరమే కాకుండా దూరభారం కూడా తగ్గుతుంది. ప్రస్తుతం కొన్ని చోట్ల రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న నిర్మాణాలను జీహెచ్ఎంసీ అధికారులు తొలగిస్తున్నారు.

గంగారం- ఆర్టీసీ కాలనీ రోడ్డు..

గంగారం ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ముందు నుంచి ఆర్టీసీ కాలనీ మీదుగా శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయం వరకు వెళ్లే రహదారి నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ సమస్య కొంత వరకు తగ్గుతుంది. ప్రస్తుతం జోనల్ కార్యాలయానికి వెళ్లే వారు చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ అండర్ బ్రిడ్జిలో నుంచి రాకపోకలు సాగించి పాపిరెడ్డికాలనీ నుంచి చందానగర్ ఎంఎంటీఎస్ వెనుక నుంచి జోనల్ కార్యాలయానికి రాకపోకలు సాగుతున్నాయి. అయితే వాహనాల రద్దీ కారణంగా అండర్‌బ్రిడ్జి వద్ద ఇక్కట్లు తప్పడంలేదు. బ్రిడ్జి దాటాలంటేనే 10నుంచి 20 నిమిషాల సమయం పడుతుంది. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నుంచి మంజీర పైప్‌లైన్ రోడ్డు వరకు సీసీరోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. మంజీర రోడ్డు నుంచి రైలు పట్టాల వరకు రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది. అయితే ఇక్కడ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిస్తేనే ట్రాఫిక్‌కు చెక్ పెట్టవచ్చు.



జాతీయ రహదారి చందానగర్‌లో ట్రాఫిక్ రద్దీ

ప్రత్యామ్నాయ రహదారులను నిర్మించాలి



జాతీయ రహదారి గంగారం ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ముందు నుంచి కొంత వరకు నిర్మాణ పనులు జరిగి మంజీర పైప్‌లైను రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మించారు. మంజీర రోడ్డు నుంచి రైలు పట్టాల వరకు నిర్మించాలి. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఆలస్యమైతే.. అక్కడున్న రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి పాపిరెడ్డికాలనీ, జోనల్ కార్యాలయం వరకు ద్విచక్రవాహన దారులు రాకపోకలు సాగించేందుకు అవకాశం ఉంది.

- బద్దం కొండల్‌రెడ్డి, పాపిరెడ్డి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ఫ్లైఓవర్ పనులు పూర్తయితే ట్రాఫిక్‌కు చెక్



చందానగర్ డివిజన్‌లో ట్రాఫిక్ సమస్య ఉన్నది వాస్తవమే. ఓవైపు బీహెచ్ఈఎల్ చౌరస్తా వద్ద జాతీయ రహదారి వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇది పూర్తయితే సగం ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది. నిధులు కూడా మంజురయ్యాయి. గంగారం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నుంచి ఆర్టీసీ కాలనీ మీదుగా జోనల్ కార్యాలయం వరకు రోడ్డు పూర్తయితే ట్రాఫిక్ సమస్య తీరుతుంది.

- మంజుల రఘునాథ్‌రెడ్డి, చందానగర్ డివిజన్ కార్పొరేటర్

నీటిని సంరక్షించుకోకుంటే మానవ మనుగడకే ప్రమాదం

- ప్రొఫెసర్ పిజి శాస్త్రి



గచ్చిబౌలిలోని ఎస్కిలో ప్రపంచ నీటి దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

రాయదుర్గం, మార్చి22 (ఆంధ్రజ్యోతి): నీటి సంరక్షణలో గ్లేసియర్స్‌ను పరిరక్షించుకోవడమే చివరి మజిలీ అని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మాజీ డైరెక్టర్, రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హెడ్, ప్రొఫెసర్ పిజి శాస్త్రి అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవనాగరికత నీటి దగ్గరే మొదలయిందని, పెరుగుతున్న జనాభాకు, గ్లోబల్ వార్మింగ్ వలన భూమిమీదున్న నీటి వనరులతో పాటుగా శతాబ్దాలుగా ఉన్న హిమానీ పర్వతాలు కూడా క్రమంగా కరిగిపోతున్నాయన్నారు. ఇది కూడా అంతరిస్తే భూమిమీద జీవజాలం ఉండదన్నారు. 1780నుండి 2015 వరకు గంగోత్రితో పాటుగా గత 50ఏళ్లలో కిలిమంజారో, సియాచిన్, గ్రీన్‌ల్యాండ్, మిలామ్, పిండారీ తదితర హిమానీ పర్వతాలు క్రమంగా ఎలా కరిగిపోతున్నాయో ప్రజంటేషన్ ద్వారా శాస్త్రి వివరించారు. ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని పండిట్ నెహ్రూ అన్నారని, ప్రపంచంలో చైనా, అమెరికా తర్వాత చిన్న పెద్ద ప్రాజెక్టులుంటే ప్రపంచంలోని 18శాతం జనాభా ఉన్న ఇండియాకు ఈ ప్రాజెక్టులోని నీరు సరిపోవడం లేదన్నారు. అనంతరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజస్ అసోసియేట్ ప్రొఫెసర్ అనుపమ మొహంతీ మాట్లాడుతూ, స్వచ్ఛమైన నీరు హిమానీ పర్వతాల్లోని అంటార్కిటికా, గ్రీన్లాండ్స్, నార్త్ అమెరికా, ఇండియాలోనే ఉన్నాయని తెలిపారు. కృష్ణ రివర్ యాజమాన్య బోర్డు పూర్వ చైర్‌పర్సన్ పరమేశం మాట్లాడుతూ, కృష్ణానదీ జలాల్లో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్రాలకు వాటాలకు వాటాలు ఉన్నందున ఏ రాష్ట్రానికి తగినన్ని నీళ్లు రావడం లేదన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ జంబుల్ రెడ్డి, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ పూర్వ చైర్మన్ నాగభూషణరావు, పూర్వ అధ్యక్షుడు జీవిఎల్ రావు, ఇంజినీరింగ్ స్టాఫ్ కళాశాల డైరెక్టర్ జి.రామేశ్వర్‌రావు మెట్రోవాటర్ బోర్డు డైరెక్టర్ వివిఎల్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



పైపులైను పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, మార్చి22(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ మొగులమ్మ బస్తీ కాలనీలో రూ.35లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే భూగర్భ డ్రైనేజీ పైపులైను నిర్మాణ పనులను కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌తో కలిసి శనివారం ఆరెకపూడి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలోఉంచుకుని కాలనీలో పైపులైను నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అత్యవసరం ఉన్న చోట వెంటనే పనులు ప్రారంభించి నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేసేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్ ఝాన్సీ, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు పలు పనులకు శంకుస్థాపన

చందానగర్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): చందానగర్, మియాపూర్ డివిజన్‌లలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లతో కలిసి శంకుస్థాపన చేయనున్నారని చందానగర్, మియాపూర్ డివిజన్ల కార్పొరేటర్లు మంజులరఘునాథ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్ తెలిపారు. ఉదయం 10గంటలకు మియాపూర్ డివిజన్ సాయినగర్ కాలనీలో రూ.38లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, డాక్టర్స్ రెడ్డీస్ కాలనీలో రూ.44.80 లక్షలతో సీసీ రోడ్డు పనులకు, హెచ్ఎంటీ కాలనీలో రూ.44లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్, సురక్షా ఎన్‌క్లేవ్, శాంతినగర్, కెఎస్ఆర్ ఎన్‌క్లేవ్ కాలనీల్లో రూ.1.25 కోట్లు, వేముకుంట సత్యఎన్‌క్లేవ్‌లలో రూ.8 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

వీడిన మిస్టరీ

- బాలిక అదృశ్యం కేసును 9 గంటల్లోపు ఛేదించిన పోలీసులు
- నిందితుడిపై పోక్సో కేసు,
- అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యం కేసు మిస్టరీని పోలీసులు 9 గంటల్లోపు ఛేదించారు. లైంగిక దాడికి యత్నించిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం... మల్కాజిగిరి ప్రాంతంలో నివాసముంటున్న దంపతుల కుమార్తె మెదక్‌లో అమ్మమ్మ వద్ద ఉంటోంది. ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసింది. కాగా తల్లిదండ్రుల వద్దకు బయలుదేరింది. జూబ్లీ బస్టాండ్‌కు చేరుకున్న బాలికను మెదక్‌లో పరిచయమైన యువకుడు మాయమాటలు చెప్పి తన వెంట తీసుకెళ్లాడు. ఎంతకీ యువతి ఇంటికి చేరకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు తమకు లభించిన సీసీ ఫుటేజీని తల్లిదండ్రులకు చూపించారు. వారిచ్చిన సమాచారంతో మెదక్ సమీపంలో ఉన్న గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించారు. స్నాప్‌చాట్‌లో అతడి ప్రొఫైల్ వివరాలు సేకరించారు. ఆ గ్రామ సర్పంచ్‌ను సంప్రదించి యువకుడి బాబాయ్ సెల్ నంబర్ తీసుకున్నారు. కాల్ చేసి యువకుడు వద్ద ఉన్న మొబైల్ నంబర్ అనంతరం దమ్మాయిగూడలో బాలిక ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. వెంటనే అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా తనపై అత్యాచార యత్నానికి ప్రయత్నించాడని బాలిక వారికి తెలిపింది. దీంతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఆపై అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన మారేడ్‌పల్లి పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

- పైలెట్ ప్రాజెక్టు కింద 17 ఎస్ఆర్‌వోలు ఎంపిక

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు(ఎస్ఆర్‌వో)ల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ భావిస్తోంది. ఉగాదిలోగా పైలెట్ ప్రాజెక్టు కింద 17 ఆఫీసుల్లో ఈ విధానాన్ని ప్రారంభించాలని సన్నాహాలు చేస్తోంది. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 148 ఎస్ఆర్‌వోల్లో ఈ విధానాన్ని తీసుకురానున్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న ఆరు ఎస్ఆర్‌వోలను అధికారులు ఎంపిక చేశారు. ఇందులో హైదరాబాద్ జిల్లాలోని చిక్కడపల్లి, ఆజంపురా, రంగారెడ్డి జిల్లాలోని ప్రాంతీయ కార్యాలయం(ఆర్‌ఓ), శంషాబాద్.. మేడ్చల్ జిల్లాలోని కుత్బుల్లాపూర్, మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో ఉగాది నుంచి రోజుకు 48 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగేలా వినియోగదారులకు 48 టైమ్ స్లాట్ల ను అందుబాటులోకి తేనున్నారు. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చలానాలను ఆన్‌లైన్‌లోనే చెల్లించి ఆ డాక్యుమెంట్లు ప్రింట్ తీసుకుని ఎస్ఆర్‌వోకు వెళితే 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అయితే సంతకాలకు బదులు ఎలక్ట్రానిక్ సిగ్నేచర్ పద్ధతిని అవలంబించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

దృష్టి మళ్లించి 50 తులాల బంగారంతో పరారీ

రాయదుర్గం, మార్చి22(ఆంధ్రజ్యోతి): దృష్టిమరల్చి 50తులాల గోల్డ్‌తో ఓ వ్యక్తి పరారైన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గచ్చిబౌలి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వివరాల ప్రకారం.. చంద్రశేఖర్ అనే వ్యక్తి లగ్జరీ హోటల్‌లో దిగే కస్టమర్లకు బంగారం విక్రయిస్తూ ఉంటాడు. అదే క్రమంలో శుక్రవారం గచ్చిబౌలిలోని సితారా హోటల్‌లో దిగిన స్టీఫెన్ అనే వ్యక్తి చంద్రశేఖర్‌కు పరిచయమయ్యాడు. మనీ ఎక్స్ఛేంజ్ చేయాలని, అమెరికన్ డాలర్లు కావాలంటూ మరో వ్యాపారి రఫీని సైతం స్టీఫెన్ సంప్రదించాడు. బంగారం, డాలర్లతో చంద్రశేఖర్, రఫీ గచ్చిబౌలిలోని ఓ మాల్‌కు వచ్చారు. స్టీఫెన్ వద్ద నుంచి బంగారం, డాలర్లు తీసుకుని నిమిషంలో డబ్బు ఇస్తానని చెప్పి వారిని మభ్యపెట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. మోసపోయామని గ్రహించిన ఇద్దరు వ్యాపారులు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ట్రావెల్ టికెట్ల పేరుతో మోసం

పంజాగుట్ట, మార్చి22(ఆంధ్రజ్యోతి): ట్రావెల్ టికెట్ల పేరుతో ఓ నృత్యకళాకారిణిని మోసగించారు. ఈ సంఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. గతేడాది ఏప్రిల్‌లో తన బృందంతో కలిసి బాలీ వెళ్లేందుకు ఢిల్లీకి చెందిన ట్రావెల్ ఏజెంట్ మోహిత్‌ను బేగంపేట.. కుందన్‌బాగ్‌కు చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి సంప్రదించింది. విమానం టిక్కెట్ల కోసం రూ.7.71 లక్షలు అతనికి ఇచ్చింది. రోజులు గడుస్తున్నా టిక్కెట్లు ఇవ్వకపోగా చుట్టూ తిప్పించుకుంటున్నాడు. దీంతో అనుమానం వచ్చి గట్టిగా నిలదీస్తే అతని నుంచి ఎలాంటి సమాధానం లేదు. దీంతో మోసపోయానని గ్రహించిన ఆమె శనివారం పంజాగుట్ట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో తిరునక్షత్ర పూజలు

ఖేల్‌కాలనీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యాదేవిగా పూజలందుకుంటున్న శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి తిరునక్షత్రం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో గల శ్రీ వెంకటేశ్వర-యోగేశ్వర స్వామి దేవాలయ అంతరాలయంలో గల సరస్వతీ అమ్మవారికి శనివారం మూలనక్షత్రం సందర్భంగా సరస్వతీ మాతకి నిత్యపూజలు, విశేష అభిషేకం జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మేధాసూక్తి హోమం, విశేష అర్చనలు జరగగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం నిత్యపూజతో పాటు అమ్మవారికి విశేష అర్చనలు, సహస్రనామార్చన జరిగాయి.

జలమండలి అధికారులకు సన్మానం

హైదర్‌నగర్,మార్చి22(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జల దినోత్సవం పురస్కరించుకుని జలమండలి కార్యాలయంలో జీఎం ప్రభాకర్, డీజీఎం నాగప్రియ, మేనేజర్ ఝాన్సీ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌ను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, తాగునీటిని వృథా చేయకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణగౌడ్, జిల్లా గణేష్, షౌకత్ అలీమున్నా, యాదగిరి, జలమండలి సిబ్బంది పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి'

ఖేల్‌కాలనీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం గిరిజన మహిళా కార్పొరేటర్ సుజాతపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై సంగారెడ్డి జిల్లా డీసీసీ ఎస్టీ సెల్ వైస్ చైర్మన్ కెమ్మసారం ఎల్లయ్య తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీహెచ్‌ఈఎల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, మహిళా ప్రతినిధి పట్ల కనీసగౌరవం లేకుండా కుల అహంకారంతో ఇష్టానుసారంగా మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై రాష్ట్ర, జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో తెల్లాపూర్ ఎస్సీసెల్ అధ్యక్షుడు ఆశీర్వాదం, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జగన్నాథ్ బాబు పాల్గొన్నారు.

అకాల వర్షం.. ముంచెత్తిన మురుగు

పేట్‌బషీరాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వీధులన్నీ జలమయమయ్యాయి. జీడిమెట్ల, కుత్బుల్లాపూర్, చింతల్, గాజులరామారం తదితర డివిజన్లలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ పొంగి రోడ్లపై నిలిచిపోయింది. జీడిమెట్ల డివిజన్‌లోని గోదావరి హోమ్స్ ప్రధాన రహదారిలో రోడ్డు వంపులు ఉండటంతో డ్రైనేజీ నీరు, వర్షపునీరు కలిసి రోడ్డుమధ్యలోనే నిలిచింది. రాఘవేంద్రకాలనీలోని ఓ ఫంక్షన్‌హాల్ సమీపంలో ఇదే పరిస్థితి నెలకొంది. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని బాపునగర్ రోడ్ నంబర్ 1లో మ్యాన్‌హోల్ పొంగి పోచమ్మ టెంపుల్, అక్కడి నుంచి సంజీవయ్యనగర్ రోడ్డులో నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాజ్‌పాయినగర్ నుంచి ప్రసూననగర్ వెళ్లే రోడ్డు ఎత్తు తక్కువగా ఉండడంతో వరదనీరంతా నిలిచింది. ఈ ప్రాంతాల్లో జనాభాకు అనుగుణంగా మురుగునీటి పైపులైను వ్యవస్థ లేకపోవడంతోనే సమస్య జఠిలంగా మారుతుందని ఆ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మురుగు నీరు నిలువకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


వాజ్‌పాయినగర్‌లో వరదనీటితో పాటు వచ్చిన బురద


గోదావరిహోమ్స్ ప్రధాన రహదారిలో నిలిచిన నీరు


బాపునగర్, సంజీవయ్యనగర్‌లను ముంచెత్తిన మురుగునీరు


రాఘవేంద్రకాలనీలో నిలిచిన మురుగునీరు

మెడికల్ కాలేజీ పనులు ప్రారంభించాలి : ఎమ్మెల్యే



దుండిగల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్‌లో మెడికల్ కాలేజీ పనులను వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ కోరారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శనివారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మంజూరైన కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 20 ఎకరాల స్థలాన్ని మెడికల్ కాలేజీ నిర్మాణం కోసం సేకరించడం జరిగిందని, హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా దానికి జీవో కూడా విడుదల చేసిందన్నారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీ పనులను చేపట్టాలని కోరారు.


సీపీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ ఉపేందర్

ప్రతిభ చూపిన సీఐకి ప్రశంసాపత్రం

నిజాంపేట్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన బాచుపల్లి సీఐ ఉపేందర్‌కు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ప్రశంసా పత్రాన్ని అందించారు. గతంలో జరిగిన రెండు హత్యల విషయంలో శిక్షపడేవిధంగా చేసినందుకు అభినందించారు. అదేవిధంగా కడ్తాల్, తలకొండపల్లి, చేవెళ్ల, షాబాద్, తారూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎనిమిది కేసుల్లో శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్నారు. సీఐని సీపీ అవినాష్ మహంతి అభినందించారు.

హెచ్ఎంటీ అటవీ ప్రాంతానికి నిప్పు

కుత్బుల్లాపూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ పరిధిలోని హిందుస్థాన్ మెషిన్ టూల్స్(హెచ్ఎంటీ) అటవీ ప్రాంతమంతా పచ్చని చెట్లతో ఆహ్లాదాన్ని పంచుతుంది. వేసవి కావడంతో చెట్ల మధ్యలో ఉన్న గడ్డి ఎండిపోయింది. అయితే గత రెండు రోజుల క్రితం గుర్తు తెలియని పోకిరీలు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగినట్లు స్థానికులు తెలిపారు. ఈ మంటలు అడవి మొత్తానికి అంటుకోవడంతో గడ్డితో పాటు చిన్న చిన్న చెట్లన్నీ కాలిపోయాయి. నిప్పు పెట్టిన పోకిరీలపై పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతమంతా కబ్జాలకు గురికాకుండా ఉండటంతో పాటు అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా పరిశ్రమ కాపలాదిద్దరు సిబ్బందిని నియమించిందని, వారు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

అత్యవసర సమయాల్లో స్పందించని విద్యుత్ సిబ్బంది

కుత్బుల్లాపూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : గాలి దుమారాలు, వర్షాలు పడిన సమయంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడితే వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా చూసేందుకు ఫ్యూజ్ ఆఫ్ కాల్(ఎఫ్ఓసీ) పేరుతో ఓ ఫోన్ నంబర్‌ను ప్రతి సబ్‌స్టేషన్‌కు కేటాయిస్తారు. అయితే కుత్బుల్లాపూర్ సబ్‌స్టేషన్ ఎఫ్ఓసీ నంబర్‌కు ఎప్పుడు ఫోన్ చేసినా స్పందించడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. శుక్రవారం రాత్రి 9 తర్వాత చిన్నపాటి గాలులు వీయడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. గాలులు తగ్గిన తర్వాత సరఫరాను పునరుద్ధరించలేదు. దీనికై ప్రజలు ఎఫ్ఓసీ నంబర్‌కు ఫోన్ చేసినా సిబ్బంది స్పందించడంలేదనే ఆరోపణలు లేకపోలేదు. అత్యవసర సమయంలో సిబ్బంది స్పందించేలా చూడాలని ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు.

ఆస్తి పన్నుల పరిష్కార వేదికకు దరఖాస్తులు

కుత్బుల్లాపూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్నులు వసూలు చేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి శనివారం ఆస్తి పన్నుల పరిష్కార(పీటీపీ) వేదికను నిర్వహిస్తున్నారు. శనివారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ఆస్తి పన్నుల పరిష్కార వేదికకు మూడు దరఖాస్తులు వచ్చినట్లు ఏఎంసీ కృష్ణ తెలిపారు. వీటిని త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు.

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

- పైలెట్ ప్రాజెక్టు కింద 17 ఎస్ఆర్వోలు ఎంపిక

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు(ఎస్ఆర్వో)ల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ భావిస్తోంది. ఉగాదిలోగా పైలెట్ ప్రాజెక్టు కింద 17 ఆఫీసుల్లో ఈ విధానాన్ని ప్రారంభించాలని సన్నాహాలు చేస్తోంది. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 148 ఎస్ఆర్వోల్లో ఈ విధానాన్ని తీసుకురానున్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న ఆరు ఎస్ఆర్వోలను అధికారులు ఎంపిక చేశారు. ఇందులో హైదరాబాద్ జిల్లాలోని చిక్కడపల్లి, ఆజంపురా, రంగారెడ్డి జిల్లాలోని ప్రాంతీయ కార్యాలయం(ఆర్ఓ), శంషాబాద్.. మేడ్చల్ జిల్లాలోని కుత్బుల్లాపూర్, మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో ఉగాది నుంచి రోజుకు 48 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగేలా వినియోగదారులకు 48 టైమ్ స్లాట్లను అందుబాటులోకి తేనున్నారు. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చలానాలను ఆన్‌లైన్‌లోనే చెల్లించి ఆ డాక్యుమెంట్లు ప్రింట్ తీసుకుని ఎస్ఆర్వోకు వెళితే 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అయితే సంతకాలకు బదులు ఎలక్ట్రానిక్ సిగ్నేచర్ పద్ధతిని అవలంబించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

అంతా కల్తీమయం

- లాభార్జనే ధ్యేయం
- తూతూ మంత్రంగా అధికారుల తనిఖీలు


దుకాణాల్లో బ్రాండెడ్ పేరుతో విక్రయిస్తున్న కల్తీ వస్తువులు

షాపూర్‌నగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో చిన్న షాపులు మొదలు హోల్‌సేల్ షాపుల వరకు కల్తీనే దర్శనం ఇస్తున్నాయి. వినియోగదారులు కల్తీని గుర్తించకుండా కొనుగోలు చేసి వినియోగించడంతో పలురకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయనడంలో సందేహం లేదు. నియోజకవర్గ పరిధిలోని షాపూర్‌నగర్, చింతల్, జగద్గిరిగుట్ట, కుత్బుల్లాపూర్, కొంపల్లి, బాచుపల్లి, నిజాంపేట్, దుండిగల్, తదితర ప్రాంతాల్లో కల్తీ సరుకుల పరంపర నడుస్తుంది. దుకాణదారులు బ్రాండెడ్‌లను పోలిన వివిధ నకిలీ వస్తువులతో చేసిన ఆహార పదార్థాలు, తినుబండారాలను ప్రజలకు అంటగట్టి దండిగా సొమ్ము చేసుకొంటున్నారు. లాభాలు అర్జించడమే ధ్యేయంగా అక్రమాలకు పాల్పడుతూ కల్తీ వస్తువులు కట్టబెడుతున్నారు. వీటిని అరికట్టాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎవరైనా సమస్యను వారి దృష్టికి తీసుకెళ్తే శాంపిల్స్ సేకరించి టెస్ట్‌లకు పంపించడంతోనే చేతులు దులుపుకొంటున్నారు. కల్తీలను గుర్తించి అందుకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు, శిక్షలు విధించకపోవడంతోనే అక్రమార్కుల ఆగడాలు రోజురోజుకు విస్తరిస్తున్నాయి. అధికారుల అలసత్వాన్ని ఆసరాగా చేసుకొని దుకాణదారులు గుట్టుచప్పుడు తమ కల్తీ వ్యాపారాలను మూడుపువ్వులు ఆరుకాయలుగా కొనసాగిస్తున్నారు.


నూనెలు

ప్రజల్లో వచ్చిన మార్పులకు అనుగుణంగా ఇంటిలో వండుకొని తినే పరిస్థితి కొరవడింది. ప్రతిది ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టుకోవడం, తక్కువ వ్యవధిలోనే కోరింది క్షణాల్లో ముందుండటంతో ప్రజల్లో సంప్రదాయ అలవాట్లు కొరవడినాయనే చెప్పాలి. దీనికి తోడు ప్రతి కాలనీ/బస్తీల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బిర్యానీ పాయింట్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హైవేల పక్కన రోడ్లవెంట తోపుడు బండ్లపై విక్రయించే ఆహార పదార్థాలు అంతా కల్తీమయమే.

- ఆహారకల్తీ, దానివల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యాలను కాపాడుకోవడం, కల్తీనివారణకు మార్గదర్శకాలు అనుసరించడం ద్వారా ఆరోగ్యాలను కాపాడుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

కఠినంగా వ్యవహరించాలి



ఆహార పదార్థాలు కల్తీకి పాల్పడుతూ ధనార్జనే ధ్యేయంగా డబ్బులు దండుకొంటున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని జాగృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు శివపార్వతి అన్నారు. మార్కెట్‌లో ఎక్కడ చూసినా కల్తీనే దర్శనం ఇస్తున్నాయి. ఫుడ్‌సేఫ్టీ అధికారులు సక్రమంగా విధులు నిర్వహించకపోవడం వల్లనే ఈ కల్తీ దందాలు నడుస్తున్నాయి.

- శివపార్వతి, జాగృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

గాజులరామారం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూమిని ప్రైవేట్ భూమిగా చూపిస్తూ ఆక్రమించుకుని వెంచర్ వేయడానికి ప్రయత్నిస్తున్న కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ మండల డిప్యూటీ తహసీల్దార్ మల్లిఖార్జున్‌రావుకు బీజేపీ నాయకులు ఆకుల సతీష్ శనివారం వినతిపత్రం అందజేశారు. కుత్బుల్లాపూర్ గ్రామం సర్వే నంబర్ 251లో కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న 35 గుంటల ప్రభుత్వ భూమిని పక్కనే ఉన్న ప్రైవేట్ సర్వే నంబర్ 249, 250లను చూపుతూ సర్వే నంబర్ 251లో 35 గుంటల భూమిని ఆక్రమించుకుని బీఆర్ఎస్ నాయకులు వెంచర్ వేశారని ఆరోపించారు. ఈ మధ్య కాలంలో కాంగ్రెస్ నాయకులు సర్వే నంబర్ 251లో ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా పేర్కొంటూ ఎన్ఓసీ, రెవెన్యూ క్లియరెన్స్ ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తీసుకురావడం జరుగుతుందన్నారు. అయితే సర్వే నంబరు 255/1లో 1100 గజాల స్థలానికి ప్రైవేట్ పట్టా భూమిగా పేర్కొంటూ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారని, 2018 నుంచి ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ స్వాధీనం చేసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. తక్షణమే ఆ భూమి చుట్టు ఫెన్సింగ్ వేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్ల జయశంకర్ గౌడ్, చందు, అరుణ్‌రావు, పాల్గొన్నారు.


కుత్బుల్లాపూర్ డీటీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు


సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

నిజాంపేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయ పేదలకు ఎంతో ప్రయోజనకరమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట, బాచుపల్లి, కొంపల్లి, రంగారెడ్డినగర్, చింతల్, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల డివిజన్లకు చెందిన వాసుల వెంకటేష్ గౌడ్, సత్తిరెడ్డి, అనిరుధ్ లాల్, శోభ, శారద, గోపాలరావు, రాములు, అన్నపూర్ణ, కులకర్ణి, ప్రవీణలకు ఒకొక్కరికి రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను, రుషిరాజుకు రూ.39 వేల మంజూరి పత్రాన్ని బాచుపల్లిలోని కార్యాలయంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే సంకల్పంతో సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్‌కుమార్, వీరేందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

ముందస్తు అరెస్టులు అన్యాయం

జీడిమెట్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల ప్రకారం కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాల జీవోను అమలు చేయాలని సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన ఛలో ఇందిరా పార్కు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వెళ్తున్న నాయకులను ముందస్తుగా జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమన్నారు. అరెస్టయిన వారిని సీపీఐ నాయకులు పరామర్శించి వారికి సంఘీభావం తెలిపారు. హైకోర్టు ఇచ్చిన తీర్పులను అమలు చేయకుండా, ప్రభుత్వ హామీలు అమలు చేయకుండా నెరవేర్చకుండా తాత్సర్యం చేయడం అన్యాయమన్నారు. అమలు చేయాలని కోరిన నాయకత్వాన్ని అరెస్టు చేయడం ఎంత వరకు సబాబన్నారు. అరెస్టయిన నాయకులను తక్షణమే విడుదల చేయాలన్నారు. అరెస్టయిన వారిలో ఏఐటీఎమ్ఈపీ జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధ్యక్షుడు హరినాథ్, కోశాధికారి సాయిలు, సీపీఐ కార్యదర్శి సహదేవరెడ్డి ఉన్నారు.

నూతన రోడ్డును నిర్మించాలి

కుత్బుల్లాపూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ వాజ్‌పాయినగర్‌లోని గోపయ్య గల్లీలో రోడ్డు శిథిలమై ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అప్పటి దేవేందర్ గౌడ్ హయాంలో వేసిన రోడ్డే మాకు దిక్కుగా మారాయని, ఐదు సంవత్సరాల క్రితం భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్‌లను వేయించిన అధికారులు వాటికి ప్యాచ్‌లు చేయకుండా వదిలేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైప్‌లైన్ల కోసం తవ్విన ప్రాంతంలో ప్యాచ్‌లు చేయకపోవడంతో రోడ్డంతా గుంతలుగా మారింది. దీంతో ఆ రోడ్డులో రాకపోకలు సాగించే వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారని బస్తీవాసులు తెలుపుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు.


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీశైలంగౌడ్

నిధులు కేటాయించాలని వినతి

పేట్‌బషీరాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కొంపల్లి పురపాలక సంఘం అభివృద్ధికి పది కోట్ల నిధులు కేటాయించాలని రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ స్థానిక నాయకులతో కలసి శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పురపాలక సంఘంలోని పీఎంఆర్ ఎన్‌క్లేవ్, అపర్ణ ఫామ్‌విడోస్, శాంతినగర్‌కాలనీ, అపర్ణ ఫామ్‌గ్రో, సెప్టిక్‌ట్యాంక్ తదితర కాలనీల్లో మురుగునీటి సమస్య, సీసీ రోడ్లు, ఊరచెరువు సుందరీకరణ పనులకోసం నిధులను కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు బి.ప్రశాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్ పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసిపడదాం

గాజులరామారం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతినీటి బొట్టును ఒడిసిపట్టు.. రేపటి తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎస్పీఆర్ ట్రస్ట్ ఫౌండర్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని చిత్తారమ్మదేవినగర్‌లో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా పది ఇంకుడు గుంతలను ట్రస్ట్ సభ్యులతో కలిసి శనివారం తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి పొదుపు చేయకపోతే రాబోయే తరాలు ఇబ్బందులకు గురవుతారని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వర్షపు నీటిని ఒడిసిపట్టి పొదుపు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

వీడిన బాలిక అదృశ్యం మిస్టరీ

- కేసును 9 గంటల్లోపు ఛేదించిన పోలీసులు
- నిందితుడిపై పోక్సో కేసు
- అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యం కేసు మిస్టరీని పోలీసులు 9 గంటల్లోపు ఛేదించారు. లైంగిక దాడికి యత్నించిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి ప్రాంతంలో నివాసముంటున్న దంపతుల కుమార్తె మెదక్‌లో అమ్మమ్మ వద్ద ఉంటోంది. ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసింది. కాగా తల్లిదండ్రుల వద్దకు బయలుదేరింది. జూబ్లీ బస్టాండ్‌కు చేరుకున్న బాలికను మెదక్‌లో పరిచయమైన యువకుడు మాయమాటలు చెప్పి తన వెంట తీసుకెళ్లాడు. ఎంతకీ యువతి ఇంటికి చేరకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు తమకు లభించిన సీసీ ఫుటేజీని తల్లిదండ్రులకు చూపించారు. వారిచ్చిన సమాచారంతో మెదక్ సమీపంలో ఉన్న గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించారు. స్నాప్‌చాట్‌లో అతడి ప్రొఫైల్ వివరాలు సేకరించారు. ఆ గ్రామ సర్పంచ్‌ను సంప్రదించి యువకుడి బాబాయ్ సెల్ నంబర్ తీసుకున్నారు. కాల్ చేసి యువకుడు వద్ద ఉన్న మొబైల్ నంబర్ అనంతరం దమ్మాయిగూడలో బాలిక ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. వెంటనే అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా తనపై అత్యాచార యత్నానికి ప్రయత్నించాడని బాలిక వారికి తెలిపింది. దీంతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఆపై అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే కేసును 9 గంటల వ్యవధిలోనే ఛేదించిన మారేడ్‌పల్లి పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

రెండోరోజు టెన్త్ పరీక్ష ప్రశాంతం


పరీక్ష కేంద్రం వద్దకు వెళుతున్న విద్యార్థిని

పేట్‌బషీరాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పదవతరగతి పరీక్షలు రెండవరోజు కుత్బుల్లాపూర్‌లో ప్రశాంతంగా ముగిశాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 12,672 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాశారు. అందులో 45మంది పరీక్షలకు హాజరుకాలేదు.

బాచుపల్లి, గండిమైసమ్మ దుండిగల్, కుత్బుల్లాపూర్ మండలాల్లోని 53 పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.


విద్యార్థినికి ప్యాడ్‌ను అందజేస్తున్న తల్లిదండ్రులు


పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

షాపూర్‌నగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల సబ్‌స్టేషన్ పరిధిలో సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా ఆదివారం 11కేవీ ఫీడర్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని షాపూర్‌నగర్ ఏఈ ఈఎస్ఆర్ క్రిష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మురుగునీటి వ్యవస్థను మెరుగుపరచాలి

పేట్‌బషీరాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని భాగ్యలక్ష్మినగర్(ఓల్డ్ పోస్టాఫీస్) వీధిలో రాత్రి కురిసిన వర్షానికి ఇళ్లల్లోకి నీరు చేరాయి.

విషయం తెలుసుకొన్న బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్‌సింహారెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులతో కలసి పర్యటించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకొన్నారు. మురుగునీటి వ్యవస్థను మెరుగుపరచాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జి.కృష్ణ, ఎం. దుర్గయ్య, కె.శాంతమ్మ, సురేష్, నరేష్, కిరణ్, విజయ్, సుగుణ, చిత్రలు పాల్గొన్నారు.

ట్రావెల్ టికెట్ల పేరుతో మోసం

పంజాగుట్ట, మార్చి22(ఆంధ్రజ్యోతి): ట్రావెల్ టికెట్ల పేరుతో ఓ నృత్యకళాకారిణిని మోసగించారు. ఈ సంఘటన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. గతేడాది ఏప్రిల్‌లో తన బృందంతో కలిసి బాలీ వెళ్లేందుకు ఢిల్లీకి చెందిన ట్రావెల్ ఏజెంట్ మోహిత్‌ను బేగంపేట.. కుందన్‌బాగ్‌కు చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి సంప్రదించింది. విమానం టిక్కెట్ల కోసం రూ.7.71 లక్షలు అతనికి ఇచ్చింది. రోజులు గడుస్తున్నా టిక్కెట్లు ఇవ్వక పోగా చుట్టూ తిప్పించుకుంటున్నాడు. దీంతో అనుమానం వచ్చి గట్టిగా నిలదీస్తే అతని నుంచి ఎలాంటి సమాధానం లేదు. దీంతో మోసపోయానని గ్రహించిన ఆమె శనివారం పంజాగుట్ట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.